నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

## నాగుల పంచమికి సెలవు ఇవ్వాలని నిరసన


నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

భైంసా, ఆగస్టు 8 : భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాల ఎదుట నాగుల పంచమికి సెలవు ఇవ్వాలని కోరుతూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ స్వర్ణ మంజుల మాట్లాడుతూ.. శుక్రవారం ఆదివాసీ దినోత్సవం ఉన్నందున పాఠశాలకు సెలవు ఇవ్వడం కుదరదని, తల్లిదండ్రులు విద్యార్థులతో మాట్లాడి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో విద్యార్థులతో మాట్లాడి తల్లిదండ్రులు వెళ్లిపోయారు.

## భర్త కలెక్టర్.. భార్య కమాండెంట్..

### రాజర్షి షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన నితిక పంత్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమాండెంట్ నితిక పంత్

ఎదులాపురం, ఆగస్టు 8 : ఆదిలాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా రాజర్షి షా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆయన భార్య నితిక పంత్ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. ఈ క్రమంలో గురువారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని రెండో బెటాలియన్‌కు వెళ్లాడు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో మొక్కలు నాటారు. ఈ క్రమంలో కమాండెంట్ నితిక పంత్(ఐపీఎస్) కలెక్టర్ రిజార్షి షాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ ఘటన యాదృచ్ఛికంగా జరుగగా.. కలెక్టర్ వెంట ఉన్న ఎస్పీ గౌష్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌లు చిరునవ్వుతో తిలగించారు.

- వర్షాలకు బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోయిన పల్లెలు
- వంతెనలు లేక ప్రజల బాధలు వర్ణనాతీతం
- కేసీఆర్ హయాంలో మెరుగుపడిన రవాణా
- కాంగ్రెస్ హయాంలో అటకెక్కిన పీఆర్, ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలు
- రోడ్లు, వంతెనల మరమ్మతుకు నిధులు కరువు
- డబ్బులు మంజూరు కాకపోవడంతో తిప్పలు


ప్రవాహంలో నుంచే వాగు దాటుతున్న చిత్తబట్ట గ్రామస్తులు

# 'దారి'ద్ర్యం

## అధ్వానంగా రోడ్లు.. అవస్థల్లో ప్రజలు..

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని చిత్తబట్ట గ్రామంలో 52 కుటుంబాలు 300లకు పైగా జనాభా ఉంది. గౌరాపూర్ పంచాయతీ పరిధిలోని ఈ గిరిజన గ్రామానికి వెళ్లేదారిలో కిలోమీటరు వరకు రోడ్డు బాగా లేదు. దీనికి తోడు ఇదే మార్గంలో వాగు ఉంది. వర్షాకాలంలో వాగు పొంగి ప్రవహించడంతో ప్రజలు తమ అవసరాల కోసం బయటకు వెళ్లాలంటే ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటాలి. భారీ వర్షాలు పడితే వాగుల ఉధృతి పెరిగి దాటలేని దుస్థితి. రేషన్ సరుకుల కోసం కిలోమీటరు గౌరాపూర్, వైద్యం కోసం మూడు కిలోమీటర్లు ధనోరా సబ్ సెంటరకు వెళ్లక తప్పని పరిస్థితి. దీంతో వానకాలం రెండు నెలలపాటు ఈ గ్రామాల ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటక తప్పడం లేదు.


బురదలో ఆగిపోయిన వాహనాన్ని బయటికి తోస్తున్న మాదాపూర్ గ్రామస్తులు

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మాదాపూర్ గ్రామంలో 50 కుటుంబాలు ఉంటాయి. ఈ గ్రామస్తులు అందరూ ఆటోలు, సొంత వాహనాల్లో ప్రయాణం సాగిస్తుంటారు. ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఆ మార్గంలో ప్రయాణం చేస్తూ నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. నిత్యావసర సరుకులు, ఇతర పనుల కోసం చిత్తగూడకు పోవాలంటే మూడు కిలోమీటర్లు, వైద్యం కోసం నార్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే మరో మూడు కిలో మీటర్లు నడిచివెళ్లక తప్పని పరిస్థితి. వర్షానికి రోడ్డు తడిసి వాహనాలు బురదలో కురుకుపోతున్నాయి. కేసీఆర్ సర్కారు ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు.

ఆదిలాబాద్/నిర్మల్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలకు ఊరు నుంచి హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలోని వాగు రాత్రికి రాత్రే ఉప్పొంగితే.. రేపో.. మాపో.. పండంటి బిడ్డ కు జన్మనివ్వాల్సిన నిండు గర్భిణీ మోకాళ్ల లోతు నీటిలో నుంచి వాగులు, వంకలు దాటాల్సిందే. మారుమూల పల్లెలు, గూడేల్లోని పిల్లలు చదువుకోసమని మండల కేంద్రంలోని బడికి వెళ్లి తిరిగి వచ్చేప్పుడు ఏ గతుకుల రోడ్డులోనో.. మట్టి రోడ్డులో ఆటో దిగబడితే తోయాల్సిందే. వాగులు ఉప్పొంగి రోడ్లు కొట్టుకుపోయినా, వంతెనలు మునిగిపోయినా.. కొన్ని గ్రామాల ప్రజలు నేటికీ రోజుల తరబడి బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా బతకాల్సిందే. వర్షాకాలం వచ్చిదంటే చాలు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఎక్కడ చూసిన కనిపించే దృశ్యాలు.. సరైన రోడ్లు లేక, వాగులు-వంకలపై వంతెనలు లేక మారుమూల గ్రామాలు, ఆదివాసీ పల్లెలు, తండాలు, గూడేల్లోని జనం నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకటి, రెండు కాదు వందల సంఖ్యలో పల్లెల్లో ఇదే దుస్థితి. పదేళ్లకు ముందు ఇంతకంటే దారుణంగా ఉన్న పరిస్థితి కేసీఆర్ సర్కార్ పుణ్యమా అని బాగుపడింది. 60 శాతం నుంచి 70 శాతం వరకు మారూమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. వందకు పైగా వాగులు, వంకలపై కేసీఆర్ సర్కార్ వంతెనలు నిర్మించింది. రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, అప్రోచ్ రోడ్డు వేసింది. ఇంకా పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ నుంచి నిధులు మంజూరు చేసింది. కొన్ని పనులు పురోగతి దశలో ఉండగా, మరి కొన్ని టెండర్ల దశకు చేరుకున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ పనులను పట్టించుకోలేదు. రీ టెండర్ పేరిట ఆపేసింది. పురోగతిలో ఉన్న పనులకు నిధులు ఆగిపోయాయి. అటవీ శాఖ అనుమతులు లేక మరికొన్ని పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. సర్కారు నిర్లక్ష్యంతో సరైన రవాణా సదుపాయాలు లేక ప్రజలు అరిగోస పడుతున్నారు. అందుకు అద్దం పట్టే ఘటనలు, ఫొటోలు, వివరాలు ఇలా.. వీటితోనైనా కాంగ్రెస్ సర్కారు స్పందించి, ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.


వంతెన కొట్టుకుపోవడంతో ప్రమాదకర స్థితిలో కడెం వాగు దాటి వెళ్తున్న పసుపుల గ్రామస్తులు

నిర్మల్ జిల్లాలోని కడెం, పెంబి, దస్తురాబాద్, ఖానాపూర్, మామడ, కుభీర్, తానూర్ మండలాల్లోని అనేక మారుమూల గ్రామాల రోడ్లు దారుణంగా తయారయ్యాయి. పెంబి, కడెం మండలాల్లోని వాగులపై ఉన్న వంతెనలు గతేడాది భారీ వరదల కారణంగా కొట్టుకుపోయాయి. కడెం వాగుపై పసుపుల వంతెన, గంగాపూర్ వంతెన ధ్వంసం కావడంతో గత కేసీఆర్ ప్రభుత్వం పసుపుల వంతెన పునఃనిర్మాణానికి రూ.5.5 కోట్లు, గంగాపూర్ వంతెనకు రూ.22 కోట్లు మంజూరు చేసింది. ఈలోగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మంజూరైన పనులు నిలిచిపోయాయి. రోడ్లు, వంతెనల కోసం ప్రజలు ఆందోళనలు చేస్తున్నా ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ రోడ్లు, వంతెనలు నిర్మించకుంటే తాము ఓటు వేయమని కొన్ని గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. గత కొన్నిరోజులుగా చాలా చోట్ల బురదమయమైన రోడ్లపై వరినాట్లు వేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి

**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**


బోథ్ : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, ఆగస్టు 8 : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సీఎంఆర్‌ఎఫ్ సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.7.58 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. దవాఖానలో చికిత్స పొందిన వారు ఆ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్ యాదవ్, రఫీ, ఎలుక రాజు, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, తాహెర్, నాయకులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, ఆగస్టు 8: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన ముండె దత్తాద్రి మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కెంద్రె న్యాను తండ్రి గంగాధర్ అనారోగ్యంతో ఉండడంతో వెళ్లి పరామర్శించారు. శాంతాపూర్ గ్రామానికి చెందిన కసావత్ మోహన్‌సింగ్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఎస్ అనితకు మంజూరైన రూ 22,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కెంద్రె న్యాను, ఇచ్చోడ ఏఎంసీ మాజీ చైర్మన్ జీ తిరుమల్ గౌడ్, నాయకులు జాదవ్ రమేశ్, జాదవ్ భీంరావ్, రాహుల్ ముండె, కరాడ్ ప్రకాశ్, దోమకొండ సుధాకర్, నక్క భూమన్న, ప్రీతంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సద్దాం, ప్రతాప్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలి

**అధికారుల సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 8 : స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేడుకలకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖలవారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను నిర్వహించనున్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా ప్రగతి నివేదిక రూపొందించాలని సూచించారు. వివిధ పథకాల గురించి తెలిపేలా శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగుల ఎంపిక కోసం శాఖలవారీగా నిర్ణీత గడువు లోపు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ పాల్గొన్నారు.

## ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్**



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

బాసర, ఆగస్టు 8 : బాసరలోని ట్రిపుల్ ఐటీలో ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై గురువారం భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా పాల్పడితే వారిపై కేసులు అవుతాయని తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే వారి వివరాలను డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, రాకేశ్, ఎస్సైలు గణేశ్, సాయికిరణ్ ఉన్నారు.

## జ్వరంతో యువతి మృతి


కోట్నాక్ జ్యోతి(ఫైల్)

ఇంద్రవెల్లి, ఆగస్టు 8 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన కోట్నాక్ భీంరావ్-కళాబాయి దంపతుల కూతురు కోట్నాక్ జ్యోతి(20) గురువారం జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మూడు రోజుల నుంచి జ్యోతి జ్వరంతో బాధపడుతున్నది. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలో రక్త పరీక్షలు నిర్వహించగా.. జ్వరంతో పాటు టైఫాయిడ్ లక్షణాలు ఉన్నాయని నిర్ధారించి మూడు రోజులు వైద్యం అందించారు. గురువారం తెల్లవారుజమున జ్వరం అధికంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలిస్తుండగా.. పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..

ఎదులాపురం, ఆగస్టు 8 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆరోపించారు. సీఐటీయూ అనుబంధ సంఘం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ఒక రోజు సమ్మె చేపట్టారు. విధులు బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షుడు రాజు, సోనేరావ్, వెంకట్‌రావ్, విలాస్, అడెల్లు, గంగన్న, అశోక్, దశరథ్, శ్రీను, రాంషావ్, బాజీరావ్, రఫీ పాల్గొన్నారు.

